గ్రామ గ్రామాన సీసీ కెమెరాలు

- గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న పోలీసులు
- తగ్గుతున్న నేరాల సంఖ్య
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


మొట్లపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న పోలీసులు(ఫైల్)

మొగుళ్లపల్లి: నేరాల నియంత్రణకు మొగుళ్లపల్లి పోలీసులు నడుం బిగించారు. ఇప్పటికే నేరస్థులను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీసులు నేరాలు జరుగకుండా ఉండేందుకు ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు నేరాలకు క్లెం వేయడానికి దోహదపడుతున్నాయి. దీంతో గ్రామాల్లో నేరాల సంఖ్య అదుపులోకి వచ్చింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు రంగాపురం, మొట్లపల్లి, మొట్లుపల్లి, వేములపల్లి, గుడిపహడ్, పోతుగల్లు, గణేష్‌పల్లి గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముకం పట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాల వినియోగం వలన కలిగే లాభాల గురించి సీఐ పులి వెంకట్, ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారు.

అందరి సహకారంతో ఏర్పాటు



మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. వారు తోడ్పాటును అందిస్తున్నారు. ఇప్పటి వరకు 8 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. త్వరలో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. అందరి సహకారం కావాలి.

–శ్రీధర్, ఎస్సై మొగుళ్లపల్లి

క్లుప్తంగా

ప్రహరీ పునర్నిర్మాణం



టేకుమట్ల: ఫిబ్రవరి నెలలో మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం ఇటీవల తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో కొంత భాగం ప్రహరీని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానించి తొలగించారు. దానిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేయగా ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రహరీ పునర్నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అనుమతులు లేకుండా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించవద్దని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత



మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన విలసాగరపు ప్రశాంత్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతడు ఆర్థికంగా ఆదుకోవాలని పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్టమధును కోరారు. దీంతో స్పందించి రూ.2,00,000ల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితుడికి పట్టు మధు వ్యక్తిగత సహాయకుడు ఎల్‌ఓసీ పత్రం అందించి మనోధైర్యం కల్పించారు.

రవీందర్‌కు అవార్డు..



చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామ శివారు భీష్మనగర్‌కు చెందిన పుట్టకొక్కుల రవీందర్ ఆదివారం భద్రాచలంలో శ్రీ సీతారామ దేవస్థానం ఆవరణంలో తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డు దశమ వార్షికోత్సవంలో అవార్డు అందుకున్నాడు. స్వరనీరాజనం సినీసంగీత గానలహరి కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎస్ 24టీవీ, నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, బెంగుళూరు, తమిళనాడు నుంచి నిర్విరామ సిని సంగీత గానాల హరి 111 మంది గాయని గాయకులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషలలో 11 గంటల పాటు సాగిన కార్యక్రమంలో రవీందర్ తన గాత్రాన్ని వినిపించి తెలుగు బుక్ ఆఫ్ ది రికార్డ్ అవార్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు టీవీ అశోక్‌కుమార్, అనుమాండ్ల నాగరాజు, పోకల శ్రీనివాస్, వనపర్తి చంద్రశేఖర్ పద్మగార్ల చేతుల మీదుగా అతనికి ప్రశంస పత్రం, మెమొంటో అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రవీందర్‌ను అభినందించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చిట్యాల: గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదేలు డిమాండ్ చేశారు. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మాదారపు రవీందర్‌గౌడ్ ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని సోమవారం ఓదేలు పరామర్శించి మాట్లాడారు. గీత వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న రవీందర్‌కు కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. కావున సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి కుమార్, నాయకులు జేరిపోతుల ఓదేలు, రవి, ఐలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మొగుళ్లపల్లి: ప్రమాదవశాత్తు కాలు జారీ దూలం పైనుంచి పడిపోయి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బంగ్లాపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన కంకటి బాలమల్లు (60) ఆదివారం ఇంట్లో ఉన్న బూజు దులుపుతుండగా దూలంపై నుంచి కాలు జారీ కింద పడిపోయాడు. అతని భార్య రోజు వారిలాగానే ఆదివారం ఉదయం కూలీపనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా భర్త బాలమల్లు కిందపడి ఉన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. బాలమల్లు భార్య ఓదులమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చిన్నకోడెపాకను మండలంగా ప్రకటించాలి


మాట్లాడుతున్న బొట్ల మనోహర్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని చిన్నకోడెపాక గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా పాలకులు మండల విభజనను చేపట్టారని అన్నారు. రేగొండ మండలంలోని అతి పెద్ద గ్రామ పంచాయతీ అయిన చిన్నకోడెపాకను మండలంగా ప్రకటించాలని సూచించారు. గ్రామంలో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు. మండల ఏర్పాటు విషయంలో ప్రస్తుతం అభిప్రాయ సేకరణ జరుగుతున్న తరుణంలో అధికారులు, పాలకులు మరోమారు పునరాలోచించాలన్నారు. తప్పని సరిగా చిన్నకోడెపాకను నూతన మండలంగా ప్రకటించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. నాయకులు నవీన్, రంజిత్, అనిల్, నరేష్, ప్రేమ్‌కుమార్, సాంబమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల అరెస్ట్

భూపాలపల్లి అర్బన్: చలో ప్రగతి ముట్టడికి తరలివెళ్లుతున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను భూపాలపల్లి ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలు, ఫిజికల్ టెస్టులో జరిగిన అక్రమాలు, అవకతవలపై విచారణ చేపట్టాలని, ఫిజికల్ టెస్టుల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులందరికీ మెయిన్స్ పరీక్షకు అవకాశం ఇవ్వాలని కోరుతూ చలో ప్రగతి భవనం కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీకాంత్, అనిల్ కిరణ్, జోసెఫ్, పవన్, తిరుపతి, రాజశేఖర్ ఉన్నారు.

కూలీల ఆధార్ సీడింగ్ పూర్తి చేయండి


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఏ మంజూల

కాటారం: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా పని పొందే కూలీలకు సంబంధించి ఆధార్ అనుసంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ డీఆర్‌డీఏ మంజూల సూచించారు. కాటారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఈజీఎస్ క్షేత్ర స్థాయి సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని సూచించారు. ఆధార్ అనుసంధానం జరిగితేనే ఆధార్ బేస్డ్ పేమెంట్ చెల్లించడం జరుగుతుందన్నారు. రెండు రోజుల్లోగా ఆధార్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న, ఈసీ శ్రీనివాస్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం ఎత్తేయడం సరికాదు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహాముత్తారం: దేశంలో సబ్సిడీ బియ్యాన్ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడం సరికాదని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలం చిన్న రాజేందర్ అన్నారు. సబ్సిడీ బియ్యం రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తు సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాధవికి వినతిపత్రం అందజేశారు. సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేయడం అంటే నిరుపేదల జీవించే హక్కును హరించడమే అన్నారు. ఈ కార్యక్రమంలో గూడెపల్లి శ్రీకాంత్, చింతల రాజబాపు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకపోవడం బాధకరమని అన్నారు. క్షేత్రస్థాయి నుంచి మొదలుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిల ప్రభుత్వ పాఠశాలల్లో ఆశించిన లక్ష్యాలను సాధించలేకపోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఆశించిన ఫలితాలు సాధించాలంటే అన్ని స్థాయిలలో ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పంచిక భగవాన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామ్ నారాయణ, ఉపాధ్యక్షులు మనోహర్ రావు, గోవిందు, సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు రహీమ్ పాషా, విజయ సాగర్, హనుమంతు, శ్రీకాంత్, సుజాత, తడక ప్రవీణ్, మండల బాధ్యురాలు శైలజ, సతీష్, రాజేంద్ర ప్రసాద్, తిరుపతి రెడ్డి, భుజేంద్రచారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నతపాఠశాలలో..

మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం పరకాల శాఖ నిర్వహకులు బీకె. స్నేహ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక క్రాంతి అనే శాంతి ప్రజల్లో తీసుకవచ్చేందుకు సంస్థ పరిచయాన్ని ఇస్తూ రాజయోగ లాభాలు వివరిస్తూ క్యాలెండర్‌ను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీకె రాజేందర్ చారి, రాజేశ్వరరావు, రమేష్, నరేందర్, జూకల్ సాయిరెడ్డి, శృంగారపు రంగాచారి, లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుపతి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

భూపాలపల్లి రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకొంది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఈర్ల సదానందం రోజువారీగా పంచాయతీ వన సేవకుడిగా విధులకు వెళ్లాడు. సదానందం భార్య రాధ పొలం పనులకు వెళ్లింది. దాదాపు మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలో నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు చూసి నీరు పోసి మంటలు ఆర్పారు. టీవీ, తదితర వస్తువులు కాలిపోయి సుమారు రూ.లక్షవరకు నష్టం వాటిల్లిందని బాధితుడు సదానందం తెలిపాడు. కాగా, ఇంట్లో ఉన్న రూ.15 వేల నగదు కూడా కాలిపోయినట్లు వెల్లడించాడు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

మంగపేట : మండలంలోని భూసంబంధిత సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కత్తిగూడెం గ్రామంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో రెండు టీములు రోజుకు రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాయని చెప్పారు. రైతులు భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి


మేళాలో ప్రదర్శనల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి అర్బన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీపీ మండల లావణ్య అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పరిషత్ పాఠశాల ఆవరణంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మండల నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మేళా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీపీ లావణ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బుర్ర రమేశ్ హాజరై మాట్లాడారు. ఒకేచోట ప్రదర్శనలతో వివిధరకాల సూత్రాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు అర్థం చేసుకునేందుకు మేళా ఉపయోగపడుతుందన్నారు. రెండు సంవత్సరాలు కరోనా వలన పిల్లల అభ్యసన సామర్థ్యం తగ్గిందని వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేలా వివిధ రకాల కృత్యాలను తయారుచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇటువంటి కృత్యమేళాలో విద్యార్థులతో పాటుగా వారి తల్లిదండ్రులను కూడా ఆహ్వానించి బోధన ఏ విధంగా చేపడుతున్నారో తెలపాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండి వారు కూడా ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే విధంగా స్ఫూర్తిని నింపాలని కోరారు. పాఠశాల స్థాయిలో చేపట్టే కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండాలని, నూతనంగా అమలు చేస్తున్న తొలిమెట్టు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మండలంలోని 52 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 47 పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్ విభాగాల నుంచి 87 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. వాటిలో ప్రతి విభాగం నుంచి మొదటి, ద్వితీయ బహుతులను అందజేశారు. ఈ నెల 20న జిల్లా స్థాయిలో జరిగే జిల్లా టీఎల్‌ఎం మేళాకు మొదటి 5 ఎగ్జిబిట్లను ఎంపిక చేయనున్నట్లు మండల నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి దేవ, కాంప్లెక్స్ మోడల్ ఆఫీసర్లు వాణి, రషీద్, ఏఎంఓ లక్ష్మణ్, జిల్లా సైన్స్ అధికారి స్వామి, జడ్జిలుగా వ్యవహరించిన మలహర్రావు, మండల నోడల్ అధికారి రఘుకుమార్, రిసోర్స్ పర్సన్‌లు రాజు, రఘునందన్, రామయ్య, స్వామి, కిషన్‌రెడ్డి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

'బహుజనులకు కేటాయించాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవిని బహుజనులకే కేటాయించాలని మహదేవపూర్ మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పర్యాయాలు సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి ఇచ్చారని, ప్రస్తుతం నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో మంథని నియోజకవర్గంలోని బహుజనులకే చైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన కాంగ్రెస్‌పార్టీ పక్షాన డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు.

గ్రామ కమిటీ ఎన్నిక

మహాముత్తారం: మండలంలోని యత్నారం గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దల కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా మంగూనాయక్, ప్రధాన కార్యదర్శిగా నూనావత్ బోజ్యానాయక్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా పుల్యాల బానయ్యను నియమించారు. అదేవిధంగా ఎస్టీసెల్ అధ్యక్షుడిగా సురేందర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పుల్యాల సమ్మయ్య, బీసీ సెల్‌అధ్యక్షుడిగా ముక్కెర మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పుట్టల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

మల్హర్: అనసూయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16 వరకు కాటారం సబ్ డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సూకల మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే సీఎస్‌ఆర్ కబడ్డీ కప్పు పోటీలకు మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండాలాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొనాలన్నారు. ప్రతి టీం రూ.500 చెల్లించాలని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 7093090860 సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ములుగు రూరల్ : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే సీతక్క సూచించారు. మండలంలోని అబ్బాపురం పంచాయతీ పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను సీతక్క పరిశీలించారు. తదనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు లభిస్తున్న వసతులను పరిశీలించారు., గణిత లైబ్రేరీని సందర్శించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి కల్పన కుమార్, నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, చంద్రమౌళి, ఆనందం, శ్యాం, భిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: అర్హులందరికీ డబల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ లోనే ఉంటూ పాలనను మరిచారని విమర్శించారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతీ పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబాల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, దేవన్, పీసీసీ సభ్యులు చల్లూరిమధు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కర్నాకర్, ఐఎన్‌టియూసీ నాయకులు జోగ బుచ్చయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: సాంఘిక శాస్త్రం విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే వ్యాస రచన పోటీలకు మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమరస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన్ ప్రతిష్టాన్, టీఎస్ఎస్‌టీఎఫ్(తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల వేదిక) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల7న జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్ర సబ్జెక్టుపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో పాఠశాలకు చెందిన సాయిచరణ్య ప్రథమ బహుమతి, సాయిశ్రీజ, ఆర్ చాందిని ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. వీరికి నగదు పురస్కారం, మెమొంటో, జ్ఞాపికలతో జిల్లా అధికారులు సన్మానించినట్లు స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు వెంకటనర్సమ్మ, సత్యనారయణ, జగన్ నాయక్, జయభాస్కర్, శివలింగం, శ్రీనివాస్, సవిత, మహేష్, వినోద్‌తో పాటు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప మాలాధారణ స్వాములకు భిక్షలు కొనసాగుతున్నాయి. బీఆర్‌ఎస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు భూపెల్లి రాజు మాలాధారణ స్వాములకు సోమవారం అన్నదానం చేశారు. అంతకముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాత భూపెల్లి రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకులు జక్కు రాకేశ్, మండల మహిళా అధ్యక్షురాలు ఎలుబాక సుజాత, ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, గురుస్వాములు పెండ్యాల రంజిత్‌కుమార్, వెంకన్న, భక్తులు పాల్గొన్నారు.